# వజ్రాదపి కఠోరాని .... ....

* రచన: "శాలావృత" *

ఆమె సంపన్న గృహిణికాదు. ఆమెకున్న ఆస్తి మొత్తమూ రెండెకరాల మాగాణీ, ఒక పెంకుటిల్లూ, ఒక కూతురూ, ఒక కుమారుడూ. కూతురు అనసూయ చక్కనిచుక్క కొడుకు ఆనందం. ఆనందం వెర్రిబాగుల వాడు. వాడికిప్పుడు పదహారేండ్లు. అనసూయకిప్పుడు పధ్నాలుగేళ్ళు పుష్పవతి అయి సంవత్సరం దాటింది. ఆనందం చదివాడు. నాలుగో తరగతివరకూ చదివాడు. వాడి మనస్సుకు చదువు నాకర్షించే ఆయస్కాంత శక్తి లేదని ఆమె గ్రహించి, వాణ్ని చదువు మాన్పించింది. ఆమెకున్న రెండెకరాల మాగాణీ పుట్టింటివారు పెట్టిన ఆస్తి. ఆ రెండెకరాలూ అమ్మి ఒక రెండు సంవత్సరాలుకులాసాగా గడుపుదామని ఆమె భర్త సలహా యిచ్చాడు. తరువాత గతేమిటని ప్రశ్నించింది ఆమె. 'కాకియై కలకాలం బ్రతుకుటకంటె, హంసయై ఆరు నెల్లు జీవించుట మంచిదని సలహా యిచ్చాడా సుగుణ సాగరుడు. ఆమె అంగీకరించలేదు. అందువల్ల అతగాడు విశాల ప్రపంచంలోకి వ్యసనాల్ని వెదుక్కుంటూ వెళ్ళిపోయాడు. ఈ సంఘటన జరిగి పదిసంవత్సరాలయింది. ఆ పది సంవత్సరాలనుండి ఇప్పటి వరకూ ఆమె గుండె రాయిచేసుకొని జీవిస్తున్నది. ఆమెకు చింత అనేది వుందో లేదో తెలియదు వూరికి వూరి వాళ్ళకీనూ, కానీ ఆమె ఇరుగు పొరుగు వాళ్ళూ. ఆమె దినచర్య పరిశీలించిన వాళ్ళూ ఆమెకు లేశమైననూ విచారం లేదంటారు. తెల్లవారున్నే లేచి వాకిట్లో పేడ నీళ్ళు చల్లి, ముగ్గులు పెట్టి తాను స్నానంచేసి, పిల్లలకు స్నానాలు జేయిస్తుంది. ఆ తరువాత పిల్లలకు చద్దిపెట్టి, తాను మడిగట్టుకుని వంటకుపక్రమిస్తుంది. దేవుడికి నివేదన చేసిన తరువాత ఏ ఒంటిగంటకో, రెండు గంటలకో, తాను అన్నంతింటుంది. తరువాత వసారాలో కుక్కి మంచం వేసుకొని దిగంతాల్లో చరించే గాలి గుర్రాల్ని చూస్తో, నిరాశా పరివ్యాప్తమయిన గహన సంసారం కుహలీ భాగంలో ఆశాలహరుల్నీ ఊహా సౌధాల్నీ కల్పించుకుని ఆ ఆశాలహరులు కల్లోలితోత్తుంగ తుంగ తరంగాలనీ, ఆ సౌధాలు పేక మేడలనీ తెల్సుకుని నిర్జీవమైన పేలవమైన చిఱునవ్వు నవ్వి నిట్టూర్పులు నిగుడిస్తుంది, 'ఆహృదయ విదారకమైన దృశ్యాన్ని చూస్తే ఎవరు చలించరు?' అనిపిస్తుంది మనకు. కానీ ఆకుగ్రామ వాసులు పేలవమైన ఆ నవ్వులో లేని పోని భావాల్ని సృష్టించి సత్య దూరాలైన విషయాలు కల్పించి ఆమెను కవ్వించ ప్రయత్నిస్తారు. చీకటి తప్పుల నిప్పుల వర్షం గురిపిస్తారు. ఆ నిప్పుల రవ్వ లామె హృదయ ప్రాంగణం లోకైనా రావు. ఆశలు మాసిపోయినా అంతా అంధకార బంధురమైనా ఒక నవ్వుతో హృదయాన్ని నిర్మలం చేసుకుంటుందామె. పరిపూతమైన, ప్రశంతమైన నిశాంత రేఖల్లో తన గమ్యాన్ని ప్రకాశవంతమైనట్లుగా ఊహించుకుంటుంది. ఆ వెంటనే నిరాశా భావస్ఫోరకమైన నవ్వుతో ఆభావాన్ని తుడిచివేసుకుంటుంది. జాలు వారిన సాంధ్యరేఖల్లో కర్కశమైన, కఠోరమైన నిశీ పరిష్వంగంలో మున్గినట్లుగా భావించుకుని ముత్యాల్లాంటి కన్నీటి బిందువూలతో ఆ బాధను భగ్నం చేసుకుంటుంది. ఆమె ఆశాజీవి అంటారు కొందరు భావకవూలు. ఆమె గమ్యమే యెఱుగని బాటసారి అంటారు కొందరు. ఆమె అందరితో నవ్వుతూ మాట్లాడు తుంది. ఆమెకు ఆనవ్వే 'భ్రష్టురాలు', 'కులట', ఇత్యాది పదాలు తెచ్చిపెట్టుంది. మంచుమీగడ లాంటి ఆ నవ్వులో అగ్ని పర్వతాలున్నాయని ఎవరూ వూహించరు. గులాబీ లాంటి ఆ నవ్వులో మదన సుమాలున్నాయని ఎవరూ అనుకోరు. లోకులు తనకు ఇచ్చే పదాలు ఆమె చెవిని బడకపోలేదు. కానీ అవి ఆమె హృదయంలోకి రాజాలవూ. తప్తలోహం పైనబడి నిశ్శేషంగా హరించుకునిపోయే నీటి బిందువుల్లా నిశ్శేషావశేషాలవుతవి. ఆమె నిశ్చలత్వమే ఆమె కింకా నిందలు తెచ్చి పెడ్తుంది.

ఊరి పెద్దల దంతా ఒక సమూహమైతే, వారి నందనుల దంతా ఒక ముఠా. ఆ ముఠాలు వేసిన గాలాలు, దారిద్ర్యమనే సరోవరంలో వున్న 'అనసూయ అనే

DEPENDABLE PLACE
For DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE,
BENGAL, etc. SAREES

SILKS of EVERY STYLE HANDLOOM COTTON SAREES, DHOTIES and other Clothing materials,

ALL OF THE HIGHEST QUALITY

S. R. B. Kuppuswamy Iyer & Son,
(Formerly:—S. R. BALUSWAMY IYER & SONS)
230, East Marret Street, Madurai. 'Phone : 36.
83, Nyneappa Naick Street, P. T. Madras. 'Phone : 3506.

చేపను పట్టుకోడానికి వాటికి చివరనుంచే' ఎర్రల స్థానంలో ధనపు సంచులు. ఆమూక అనసూయ కేసి చూస్తుంది, నవ్వుతుంది, చెప్పలేని, వ్రాయలేని సంజ్ఞలు చేస్తుంది. ఆ పిల్ల ఏమి చేయగలదు, మారు మాట్లాడక తలవంచుకుని తన మానాన్న తను వెడ్తుంది. ఎందుకంటే ఆమె మాట్లాడ్డానికీ సమాధానం చెప్పడానికీ అనర్హురాలుగదా! ఆ తుంటరిసమూహం అనసూయను 'పులికడుపున మేక బుడ్తుందా' అంటుంది.

ఆర్నెల్లు దొర్లినవి. దొర్లినయ్యేకానీ ఆ సూక్ష్మమై వ్యవధిలోనే, సుదీర్ఘమైన జీవితయాత్రకు మూలమైన మనస్సులు చాలావఱకు మారినవి. ఆమె హృదయం మాత్రంమారలేదు. అదేనవ్వు, అనే నిట్టూర్పులు, అనే వూహాసందోహాలు. అర్నెల్ల క్రితపుట నసూయకూ, ఇప్పటి అనసూయకు చాలా తేడావుంది. ఇప్పుడామెకు ఒకవూరి పెద్దకుమారుడు సర్వాధికారి. చేతిలో చేయి వేయకుండా, ప్రమాణాలుచేయకుండా, హృదయం విప్పకుండా, 'ఆడితప్పననీ, అనసూయను, 'చేసుకుంటాననీ' వాగ్దానంచేశాడు. ఇప్పుడతగాడాపిల్లకు వల్లలేనిప్రేమగాడులా కన్పిస్తున్నాడు, ఆమె మనస్సులోని కోర్కెలు పొంగాయి, పరువూ, ప్రతిష్టలపైన భరోసాను విడనాడింది. కామావగుంఠనంచేత కన్నులు మూసికొనిపోయాయి. తత్ఫలితంగా లోకమేమీ కానుపించలేదు. అరిషడ్వర్గాలు చెలరేగాయి. అంతరాత్మ అణిగిపోయింది వెలుగు చూస్తున్నాననుకొంది, చీకటే కనుపించలేదు. హిమవత్పర్వతోత్తీర్ణు రాలనవుతున్నాననుకొంది గానీ, పాతాళావతీర్ణు రాలవుతున్నాననుకోలేదు. అడుసు ద్రొక్కింది, పాదప్రక్షాళనం చేసుకోలేక పోయింది. ఈ వార్త యింకా ఆమె చెవిని బడలేదు. ఆమె ఆలోచనలకు విసుగులేదు, ఆమెకు విరామంలేదు.

మరికొన్ని నెలలు గడచినవి. తలవని తలంపుగా ఒకరోజున యీ సంగతి ఆమె చెవినిబడింది. అనసూయ పాలుతీసుకొని వస్తున్నది. చెంబునిండా పాలున్నాయి

గడపదాటింది. ఛెళ్ళుమని చెంపపైన అయిదు వ్రేళ్ళూ అంటుకొని పోయినవి. కండ్లలో నీళ్ళు గిర్రున సుళ్ళు తిరిగినవి. బాధా విస్మయనేత్రాలతో తలయెత్తింది. ఎదురుగా ఆమె తనతల్లి ప్రపంచానికి ప్రళయసంభవించే సమయంలో వుండే భీకరమైన మహాశక్తిలావుంది ఆ చూపులో శతసహస్ర పన్నగాలు కోఱలు జాచుతూ, నాలికలు కోరుతూన్నట్లున్నవి. ఆ చూపులో మధ్యాహ్న మార్తాండు భీష్మాతపజ్వాల లామె హృదయాన్ని దహించి వేస్తూన్నట్లుగా ఆమె భావిస్తోంది. పాలచెంబు క్రింద పడింది. పాలు ఒలికి పోయాయి. ఆమె అశాక్షీరాలు సైతం భూదేవి త్రాగివేసింది. "అమ్మా!" అంటూ క్రిందికి ప్రళయ జంఝానిల విమూలితమైన. తరువులా, వాలిపోయింది, కాదు కూలి పోయింది. ఆర్తనాదం భూదేవి విన్నదేమో కౌగలించుకున్నది. ఆమె హృదయంలో మాతృప్రేమ కిరణాలు రవంతైనా పొడసూపలేదు. చర, చరా వెళ్ళింది. ఆమె అడుగులవరకు భూకంప మొచ్చినట్లనిపించిం దనసూయకు. ఆమె లేవలేదు అలాగే భూదేవీ పరిష్వంగంలో నిద్రావకుంఠనంలో మునిగిపోయింది. నేల నొలికిన పాలు ఆరిపోయినవి. ఆమె మళ్ళీ అమంచంపైన పడుకొంది. ఏ అనిర్వచనీయమైన ప్రేమామృతస్వరూపిణీయో ఆమె హృదయంలో కండోల వీణా తంత్రుల రవంత సవరించింది. ఆమె క్రోధ పూరిత తీక్షణరూక్షనయనాల్లో ఏదో వలపుల లెన్నెలనది ప్రవేశించినట్లయింది, ఏదో క్షీర నిర్ఘరిణి కొండరాళ్ళ పైన్నుండి పరుగుతీస్తూ, మధురమైన నిస్వనం పల్కినట్లన్పించింది. ఆమె తన ముఖాన్ని భూదేవి కభిముఖంగా చేసి పశ్చాత్తాప పడసాగింది, సూర్యభగవానుడు మరణ కాంతులు జాలువార్చుతూ పశ్చిమాద్రి చాటుకు గ్రుంకు తున్నాడు,

మరికొన్ని నెలలు గడచి పోయినవి. ఆమె శరీరం ముడుతలు పడ్తోంది. ఆమె గమ్యం చేరవస్తోంది, అనసూయకిప్పుడు పదిహేనేళ్ళు, ఆమెకింకా వివాహం కాలేదు. ఆమెకు దిక్కు తోచలేదు. కూతురుపైన యిప్పటికే వూరంతా అపోహలు వెదజల్లబడినాయి. ఆ అపోహలు ఆమె 'గర్భవతి' అని. ఇక తెల్సుండి అనసూయను పరిగ్రహించే దెవరు? ఇప్పుడు తల్లీ, బిడ్డలిద్దరూ పతితలు. ఆమె మొర భగవంతుడు సైతం ఆలకించలేదు. ఆడది, అందులోనూ లోకుల దృష్టిలో భ్రష్టురాలు, అంతకన్న ఏం చెయ్యగలదు? తనకు తెల్సిన బంధువూలందరికీ సంబంధ మేదయినా కుదిర్చి పెట్టమని జాబులు వ్రాయించింది వాళ్ళ దగ్గరినించి జాబు కూడా కరువై పోయింది. ఆమె మొఱలాలకించే వాళ్ళెవరు?

చివరికొక దారినపోయే దానయ్య ఆమె గారికొక సంబంధాన్ని గురించి చెప్పాడు. 'వరుని వయస్సు ముప్పై ఆరు వుంటుంది. ఆస్తి పదెకరాల మెట్ట. అతగాడికి మాగాణిపైన అపరిమితమైన 'ఆశ'ట. పోనీ రెండెకరాల మాగాణిలో ఒక ఎకరం అల్లునికి వరకట్నం క్రింద ఇచ్చేట్లయితే చేసుకుంటారుట; ఆమె కేమీ పాలుబోలేదు. ఆలోచించి కబురు చేస్తానంది. అతగాడామె వైపదో విధంగా చూసి 'ఊళ్ళో ఉన్న పుకార్లను బట్టి, నిజం చెప్పాలంటే యీ అమ్మాయికి పెండ్లి అవటం కష్టం. అయినా నేను శాయశక్తులా కష్టపడి వరుణ్ణి ఒప్పిస్తాను, తరువాత మీ

మీ ఆభరణాలకు
అత్యుత్తమమైనది




అజంతా
వజ్రములే!!

TEL: "FOUNDRY" PHONE: 535



మావద్ద తయారైన నవీన మానోబ్లాక్ పంపుసెట్టు

ఇతర తయారింపులు సెంట్రిఫ్యూకల్ పంపులు

1. మోటారు జతలో చేర్చబడినది
2. బెల్ట్ డ్రివన్
3. చెరుకు ఆలెలు
4. గన్ మెటల్ వాల్వులు

సుబ్బయ్యా ఫౌండరి

పాపనాయకన్ పాళ్యం :: కోయమత్తూరు

ఏజంట్లు :— శ్రీ ఎస్. జె. దాస్ (ఎస్.ఎఫ్. రెప్రెసెంటేటివ్)

న్యూపెట్, చంద్రగిరి (చిత్తూర్ జిల్లా)

యిష్టం' అని వెళ్ళిపోయాడు. ఆమె ఆలోచనలో పడి పోయింది. ఏమిటి కర్తవ్యం. 'ఉన్న రెండెకరాలల్లో ఒక ఎకరం కట్నం కొడుకును అన్యాయం చెయ్యడమా!' దాని జీవితాన్ని నాశనం చెయ్యడమా. పరువూ, ప్రతిష్టా గంగపాలు కావల్సిందేనా. వీల్లేదు. 'అన్యథా శరణం నాస్తి'. ఆమె ధృఢ నిశ్చయాని కొచ్చింది. ఆదారిన పోయే దానయ్యను పిలిపించి ఏ సంగతీ కనుక్కోమంది. 'సరే'నని వెళ్ళిపోతూ నేను ఉత్తరం వ్రాసినప్పుడు అక్కడకురా' అని చెప్పాడు.

ఆమెకు దారీ తెన్నూ తెలియని ఎడారిలో సాంద్ర వృక్షశ్రేణీ వ్యాలీ ధోపాంతమైన సరోవరం కాన్పించినట్లయింది అమావాస్యనాంటి అర్ధ రాత్రిలో వినలేనిది వాంధాల అరువుల్లో మధుర మోహనమురళీ గీతికలు పాడినట్లూ, పాల వెన్నెలల జల్లు కురిసినట్లన్పించింది. నిలువ నీడలేని తనకు స్వర్ణ వర్ణసౌధ నివాసం లభించినట్లయింది. తనకు గల్గిన యీ అదృష్టానికి జడములైన స్ఫటికశిలలు సహితం అసూయతో కృశించి పోతున్నట్లన్పించింది. ఆమెకు చాలా సంతోషమయింది.

ఊర్లోని వారికెవ్వరికీ చెప్పలేదు. ఒక రోజున ఆ దానయ్య దగ్గర్నించి కబురు వచ్చింది. ఆమెగారు అనసూయను వెంట బెట్టుకుని బయలుదేరింది. పూర్వ సువాసినులు క్రొత్త కుండలు చేతబట్టుకుని 'ఎక్కడి కెడు

తున్నారమ్మా' అని అడుగుతూ ఎదురయ్యారు. ఆమె నిర్ఘాంత పోలేదు. మిన్ను విరిగి మీద బడినట్లుగా మేను మరచి క్రింద బడలేదు. తలవంచుకుని తన దారిన తాను బయల్దేరింది. ఖర్చుల నిమిత్తం తెచ్చిన అయిదొందలూ యింటిని తనఖాబెట్టిన బాపతువి. అయిదొందలా ఆయింట్లో పెడితే నిలవని, బొడ్లో దోపుకుందామె. ఒక ప్రక్కన తల్లిచేయి పట్టుకున్న అనసూయా, మరొక వైపున తల్లి కొంగుపట్టుకున్న ఆనందం, 'కాళ్ళు కాలిపోతున్నాయే' అంటూ గోలబెడ్తున్నారు. ఊరి బయట వరకూ ఎలాగోలా నడవమని ఆజ్ఞాపించిందామె. వాళ్ళు ఉసూరు మంటూ నడుస్తున్నారు. ఆమె గమ్యం అక్కణ్ణుంచి ఆరుమైళ్ళుంది. కలగబోయే శుభ మహోత్సవాన్ని కండ్లలో వూహించుకుని మధుర స్వప్నాలు కంటోందామె, మిట్ట మధ్యాహ్నం వేళప్పుడు. 'కాళ్ళు కాల్తున్నాయే' అంటూ అటూ, యిటూ చిందులు త్రొక్కుతూనడుస్తున్నా ఆనందం. కొడుకుని చూపి తృప్తిగా నవ్వుకొందామె. ప్రక్కన్నే తలవంచుకుని నడుస్తోందనసూయ. ఎండబుస కొడ్తోంది. ఇంటి ముందర్నుంచి వెడుతోన్న అనసూయనూ, ఆమె తల్లినీ చూసీ ఒక్కమారు నిష్ఠీవనంచేసి మళ్ళీ పొగాకు యీనెలు తియ్యడంలో మునిగిపోయాడు పెద్దకాపు. అనసూయ అటు వైపు తిరిగింది. ఊరి పెద్ద కొతుకు 'కత్తెర మార్కు సిగరెట్టు కాలుస్తో యీలవేశాడు హుషారుగా అనసూయ తలవంచుకుని ముందుకు నడిచింది. తండ్రీ కొడుకులు పెద్దగా నవ్వుకోవడం ఆమె చెవిని బడక పోలేదు. పిండిలాంటి, ఇసుకలో. మండుతున్న ఎండలో ఆలోచించుతో మందంగా నడుస్తున్నది. 'ఎంత దూర మీ పయనమూ' అని ఊరి పెద్ద యింట్లోని రేడియో పాడుతోంది.

* * * *

ఎండబాధను భరించలేక కాళ్ళకు తంగేడు మండలు చుట్టుకొంటూ, మొఅపవాగులు తటస్థ పడ్డప్పుడెల్లా తపైన కాసిని నీళ్ళు చల్లుకొంటో పయనించిన ఆ ముగ్గురూ చేరవలసిన గ్రామం చేరుకున్నారు. ఆదానయ్య యిల్లు తెల్సుకుని చేరుకున్నారు. ఆతడు ముందుగా కాళ్ళకు నీళ్ళిచ్చి, దాహం తీర్చి మంచం వాల్చి కూర్చోమన్నాడు. ఆమె మంచం మీద కూర్చోడానికి నిరాకరించి చాపపైన కూర్చుంది. ఆమెకు సంభాషణ ఏవిధంగా మొదలుబెట్టాలో అర్థంగాలేదు. పోనీ అతడన్నా ఆ ప్రసక్తి ఎత్తుతాడేమోనని కాస్సేపు నిరీక్షించింది. కానీ లాభం లేక పోయింది. చివరకు ఆమే ధైర్యం చేకూర్చుకొని అడిగింది. 'ఏవండీ అన్నగారూ! మరి అమ్మాయికి సంబంధ వేదో ఉందన్నారు కదా!' ఆసంగతి కనుక్కుందామని వచ్చేను, అంది.

'తెలుసు కొనే దేముంది నే చెప్పాను గాదుటమ్మా!


# MYSORE LAMPS

BEST IN THE MARKET

UNDER GOVERNMENT OF INDIA RATE CONTRACT

ALL TYPES OF LAMPS MANUFACTURED.

## THE MYSORE LAMP WORKS LTD.,

**MALLESWARAM P.O., BANGALORE-3.**

Telegrams: "MYSORELAMP" :: Telephone: 2026

ఎకరం మాగాణీ ఇచ్చి వివాహం చేయించాలి' అన్నా డాతడు.

'మరి వరుడిగోత్రం వాటి సంగతీ సందర్భాలు శల విస్తారా' అని అడిగింది ఆమె.

'ఆ! అవన్నీనాకు మాత్రం సరిగ్గా తెలుసా! ఏదో నువ్వడిగావు గనుక 'వుందీ' అని చెప్పాను. వీరినీ కనుక్కున్నాను, వారికంగీకారమే అయింది. అబ్బో! చాలా ప్రయత్నించాను. ఎంతయినా ఆవరుడి తండ్రి మరి ఆ అమ్మాయిని గురించీ, వాళ్ళకుటుంబాన్ని గురించీ చెడ్డగా చెప్పుకుంటున్నారే' అని గొణగటం మానలేదు. నేను 'ఆ! ఏదోగిట్టని వాళ్ళు కల్పించారని అబద్ధమాడి నానాగడ్డి గఱచి విశ్వ ప్రయత్నం మీద ఒప్పించాను.' అని మీసం మెలేసుకుంటో చెప్పాడు దానయ్య.

'ఆమె' యివన్నీ వింటూంది తలవంచుకుని. అతడు చెప్పడం ముగించిన తర్వాత 'ఆమె' తలయెత్తి 'మరి మాకూ సమ్మతమే వారింటికి వెడదామా!' అన్నది.

'వెడదాం! కానీ. నువ్వీ చీరతోటీ దుమ్ముగొట్టుకున్న యీ ముఖం తోటీ వస్తే లాభంలేదు ఏదైనా మంచి చీరకట్టుకుని కాస్త ముఖం కడుక్కుని రావాలి' అన్నా డాయన.

'నేను చీరలేవీ.........' ఇక మాట్లాడ లేకపోయింది ఆమె, కంఠరుద్ధమయిన కారణం చేత.

'సరి, సరి. నా కర్థమయింది లేమ్మా నీబాధ. నాకూ వున్నారు నీ బిడ్డ లాంటి బిడ్డలు, మా ఆవిడ చీరెవూంది తీసుకొస్తానుండు' అని లోపలికి నడువబోయాడు. అంతలోనే ఆమె 'ఆ! ఎందుకు లెండి యీ చీరతోవస్తా' అంది. 'కూడదమ్మా! కూడదు. నీ విలా వస్తేవారు నిన్ను గురించి చెడ్డగా తల్చవచ్చు. అందువల్లనేనే నింతగా చెప్తూంట' అని యిక ఆమెనుంచి సమాధానం ఆశించకుండానే లోపలికి వెళ్ళిచీర తెచ్చి యిస్తూ 'విడచిన చీర ఆదండెం పైన వేయమ్మా' అని చెప్పి తానివతల కొచ్చాడు.

ఆమె చీర ధరించి యివతల కొచ్చింది. వరుడి యింటికి వెళ్ళారంతా, పెండ్లి కూతురు వరుడి యింట్లో చాప మీద ఒక మూలగా కూర్చుంది. 'ఆమె'కు వరుడి తలిదండ్రుల మాటతీరూ, ఇంటి వాలకమూ, అనుమానాస్పదంగా తోచినయ్. కానీ ఆమె యేమీ మాట్లాడలేదు. ఆదానయ్య 'నేనిప్పుడే వస్తా'నంటూ వెళ్ళాడు. చాలా సేపటికి తిరిగి వచ్చాడు. ఈ లోపున ఆర్థికమైన ఇబ్బందులూ, అవీ వివరించాడు వరుడి తండ్రి. కాస్సేపటికి 'దానయ్య' మరి పురోహితుణ్ణి పిలుద్దామా?' అని అడిగాడు, 'మరి వారి గోత్ర విషయం చెప్పారు కాదే' అంటూ సందేహం వెలిబుచ్చింది 'ఆమె' 'దానయ్య' అందుకుని 'ఆ! ఇవ్వాళా, రేపూ గోత్రాల్నెవరు పట్టించుకుంటున్నారమ్మా! నీదంతా వెర్రిగానీ' అంటూ నసిగాడు,

'ఆమె'కు గాభరావేసింది. 'ఏమిటీ మీ ఉద్దేశ్యం' అని అడిగింది 'దానయ్య'ను.

'ఆఁయేముందీ యివ్వాళా రేపూ కులగోత్రా విషయమై ఎవరు పట్టించుకుంటున్నారు చెప్పండి' అన్నాడు. ఆదానయ్య. దానయ్య మాటల్లోని అంతరార్థం గ్రహించిన 'ఆమె' లేచింది. బుసలు కొడ్తున్న త్రాచు పాము రీతిగా. విసురుగా బయటకు నడిచింది.

ఆ 'దానయ్య' వారితోఏదో చెప్పి ఆమె వెంటనే నడిచాడు. తాళం తీశాడు. 'ఆమె' చీర తీసుకొని దాన్ని బట్టుకుని తమకట్టుకొన్న వాళ్ళ చీర విడచి బయటకు నడిచింది. వెంట నడిచారు అనసూయా, ఆనందాయ్. మళ్ళీ ఎమరెండలో నడిచి గ్రామం చేరుకున్నారు.

ఊరి పెద్దకాపు సగర్వంగా దొర పొగాకుచుట్ట నోట్లోంచి తీసినవ్వి మీసం మెలి పెట్టాడు. నీరసంగా నిరాశగా కాళ్ళీడ్చుకుంటూ వస్తున్నదామె. రేడియో పాడుతోంది సన్నగా....

ఎంతొ సుదూరయాన మిదిహీనము, దుర్భర మెండ మావుల౯ యెంతని వెంబడించెదవు యీగతి, భోగము లెవ్విలేవు, నీస్వాంతము కెందులేదు సుమ సౌఖ్యము కల్గుట, లోకమెల్ల కెంతయొ కీడు దల్చెగద, గేహము జేరుట దెన్నినాళ్ళకో నీ.

రేడియో నుంచి వస్తోన్న ఆలాపన గాలిలో కలిసిపోతోంది. ఆమె చలించకుండా యింటికి చేరింది. మళ్ళీ ఆదేకుక్కి మంచం, అనే ఊహా సందోహాలు. ఆమె హృదయం వజ్రంకంటె కఠోరం, పుష్పం కంటె మృదులం....